## ఎన్టీఏ బోర్డును రద్దుచేయాలి

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఎన్టీఏ బోర్డును రద్దు చేసి, నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నీట్ పరీక్షపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి, 24లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలని, మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.

– ఖలీల్‌వాడి, జూన్ 19







# కేసీఆర్‌తోనే వెలుగు జిలుగులు



- తీవ్రమైన కరెంట్ సంక్షోభానికి విరుగుడు
- కర్షక లోకానికి ప్రయోజనం చేకూర్చిన కేసీఆర్
- సమైక్య పాలనలోని చీకట్లను పారదోలిన వైనం
- 24గంటల కరెంటు ఇచ్చిన ఏకైక సీఎం

ఉచిత విద్యుత్‌తో సాగు రంగానికి ఊపిరి

నిజామాబాద్, జూన్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఆరు గంటల కరెంట్ అది కూడా రెండు విడుతలు లేదంటే మూడు అదీ కాకపోతే నాలుగు విడుతల్లో సరఫరా అయ్యేది. అరకొరగా వచ్చే కోతల కరెంట్‌తో పంటలు సరిగా పండక, పారిన మడులే మళ్లీ పారి రైతులు అరిగోస పడేది. అర్ధరాత్రి 12గంటల తర్వాత వచ్చే త్రీఫేజ్ కరెంట్ కోసం పొలాల వద్ద పడిగాపులు కాసేవారు. ఒక్కసారిగా మోటార్లు స్టార్ట్‌వ్వడంతో ఎగిరిపోయిన ఫ్యూజులను మార్చే క్రమంలో ప్రాణాలు కోల్పోయి రోడ్డున పడిన రైతు కుటుంబాలు కోకొల్లలు. దుర్భరమైన దుస్థితిలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉండేది. పేరుకు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా అయినప్పటికీ ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలియని పరిస్థితి. పంటలను కాపాడుకునేందుకు రైతులు పొలాల వద్దనే నిరీక్షించాల్సి వచ్చేది. అధిక ఒత్తిడితో పటాకుల్లా పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లతో ఆర్థికంగా రైతన్నలు అవస్థలు పడిన సందర్భాలు అనేకం. బోరుబావుల్లో సమృద్ధిగా నీరున్నప్పటికీ పంటలకు అందక రైతులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలున్నాయి. ఉచిత విద్యుత్ హామీని స్వయంగా నెరవేర్చలేక చతికిల బడిన కాంగ్రెస్ పార్టీ తీరు మూలంగా పదేండ్ల క్రితం రైతులు పడిన గోసకు స్వరాష్ట్రానికి తొలి సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే కారు చీకట్లను కేసీఆర్ తొలగించారు. సాగుకు, పరిశ్రమలకు, గృహ అవసరాలకు 24గంటల నిరంతర విద్యుత్‌ను అందించి శభాష్ అనిపించుకున్నారు.

### సాగుకు వెన్నుదన్నుగా నిలిచిన కేసీఆర్..

రైతులకే కాకుండా అన్నివర్గాలకు కరెంట్ ఇక్కట్లను సీఎంగా పని చేసినంత కాలం కేసీఆర్ తన దార్శనికత, దూరదృష్టితో దూరం చేశారు. 2014కు మునుపు నిత్యం పవర్ హాలిడేలు ఉండేవి. తద్వారా పిండి గిర్నీ నుంచి జిరాక్స్ సెంటర్ల వరకూ అన్నీ మూసేసుకునేది. వ్యాపారులు పని లేకుండా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిశ్రమలు మూతపడ్డాయి. ఉత్పత్తి లేక నష్టాలను చవిచూశాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పరిశ్రమలు, గృహ అవసరాలకు నిరంతర విద్యుత్ సక్రమంగా అందింది. పవర్ హాలిడే అన్న పదమే కనిపించలేదు. రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ మాదిరిగానే కులవృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న సామాన్య పేద కుటుంబాలకు కేసీఆర్ అండగా నిలిచి వారి బతుకుల్లో వెలుగులు నింపారు. రజక, నాయీబ్రాహ్మణ వర్గాన్ని గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వాలూ పట్టించుకోలేదు. క్షౌరశాలలు, లాండ్రీ షాపులు, దోబీ ఘాట్‌లకు 250 యూనిట్లు వరకు విద్యుత్‌ను ఉచితంగా అందించారు. ఇప్పుడీ పథకానికి అతీగతీ లేకుండా పోయింది. నిజామాబాద్ జిల్లాలో 1031 లాండ్రీలు, 1371 సెలూన్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా పథకం అమలు చేశారు. కామారెడ్డి జిల్లాలో 686 సెలూన్లు, 477 దోబీఘాట్లకు మేలు చేకూర్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ పథకం అమలుపై గందరగోళం చోటు చేసుకున్నది.

### 2.72లక్షల వ్యవసాయ కనెక్షన్లు..

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 7లక్షల 73వేల విద్యుత్ కనెక్షన్లలో 1,75,765 వ్యవసాయ కనెక్షన్లున్నాయి. కామారెడ్డి జిల్లాలో మొత్తం 3లక్షల 74వేల 46 విద్యుత్ కనెక్షన్లలో 95,901 వ్యవసాయ కనెక్షన్లున్నాయి. ఉమ్మడి జిల్లాలో 2లక్షల 71వేల 666 వ్యవసాయ కనెక్షన్లకు ఉచిత కరెంట్ అందుతున్నది. పల్లెటూర్లలో పండుగలు, ఏదైనా శుభకార్యాలు జరిగినప్పుడు పగటి పూటా అరగంట కరెంట్ కోసం ఆపసోపాలు పడిన నేపథ్యం ఇప్పటికీ విద్యుత్ ఉద్యోగుల, ప్రజల మనసుల్లో స్పష్టంగా ఉన్నది. గృహ, వాణిజ్య వినియోగదారులకు పట్టణ, నగర ప్రాంతాల్లో 4–8 గంటలు, గ్రామాల్లో 12 గంటల వరకు ఏకబిగిన కరెంట్ కోతలుండేవి. పవర్ హాలిడే కొనసాగిన దుర్భర పరిస్థితుల నుంచి దేశం మొత్తమ్మీద తొలిసారిగా రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ అందించే స్థాయికి ఎదగడం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికే చెల్లింది. పవర్ జనరేషన్, అందుకు తగిన విధంగా సరఫరా, డిస్కంల ద్వారా పంపిణీ ఇవన్నీ రెండింతలుపైగా మౌలిక సదుపాయాలను కల్పించి అభివృద్ధి చేసుకోవడంతోనే ఉచిత విద్యుత్ ఆటంకాల్లేకుండా సాగింది. కానిప్పుడు చీటికి మాటికీ గృహ అవసరాల్లో కరెంట్ కటకట తప్పడం లేదు. వ్యవసాయానికి చాలా చోట్ల కోతలు పెడుతున్నట్లుగా రైతులు ఆరోపిస్తున్నారు.

### కోతలులేని కరెంటు అందింది..



బోధన్ రూరల్, జూన్ 19: బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కోతలు లేని కరెంటు అందించారు. దీంతో మాకు చాలా వరకు పనులు ఆపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడలేదు. చేతినిండా పనులు చేసుకున్నాం. ఏం చేశారో తెలియదు కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన కరెంటుతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేసుకున్నా. కరెంటు కష్టాలు అనేవి కంటికి కనిపించకుండా పోయాయి.

**– శ్రీకాంత్, బోర్ మెకానిక్, మోస్రా**

### నాణ్యమైన కరెంటు ఇచ్చిండ్రు..



కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో కోతలు లేని విద్యుత్ సరఫరాతో పనులు ఆగకుండా చేసుకున్నాం. ఆర్డర్ల మేరకు కేజ్‌వీల్స్, ట్రాక్టర్ ట్రాలీలు తయారు చేసి రైతులు కోరిన సమయంలో అందించేవాడిని. ఎలాంటి ఇబ్బందులు లేకుండా, కోతలు లేని కరెంటు అందడంతో పనులు సాఫీగా జరిగాయి. నాణ్యమైన, కోతలులేని విద్యుత్ సరఫరా అవ్వడంతోనే పనులు చేసుకున్నాం.


**– గాండ్ల సాయిలు, ఇంజినీరింగ్ వర్క్స్, సాలూరా**

### రైతులకు ఇబ్బంది లేకుండా చేసిండు..



కేసీఆర్ ప్రభుత్వంలో మంచి కరెంటు అందింది. పంటల సాగుకు అనుకూలంగా కరెంటు అందడంతో ఒక్కసారి బోరు స్విచ్ ఆన్ చేసి ఇంటికి వస్తే మళ్లీ పంటకు సరిపోయే నీరు పట్టిన తర్వాతే వెళ్లి మోటరు బంద్ చేసేవాడిని. కరెంటు సరఫరా విషయంలో కేసీఆర్ రైతులకు దేవుడిగా మారాడు. ఏం చేసిండో ఏమో గానీ కరెంటు మాత్రం రైతులకు ఇబ్బంది పడకుండా అందించిండు.

**– ఆర్. ఫకీరా నాయక్, రాజీవ్‌నగర్ తండా**



## పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

### మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం

నస్రుల్లాబాద్, జూన్ 19: నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామ శివారులో ఉన్న కొచ్చెరు మైసమ్మ ఆలయం వద్ద రూ.కోటీ60లక్షలతో నిర్మిస్తున్న కాటేజీ పనులను మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొచ్చెరు మైసమ్మ ఆలయం దినదినాభివృద్ధి చెందుతుండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని, వారి సౌకర్యార్థం కాటేజీలను నిర్మిస్తున్నామన్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీపీ పాల్త్య విఠల్, బీఆర్ఎస్ నాయకులు అంజిరెడ్డి, సాయిలు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మాజీద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక రుణ ప్రణాళిక ఖరారు

### పంట రుణాలకు రూ.3,425.85కోట్లు

కామారెడ్డి, జూన్ 19: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలు, అగ్రికల్చర్ టర్మ్ లోన్స్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తదితర రంగాలకు రూ.6,412.60 కోట్లు అందించనున్నామని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన బ్యాంకర్ల సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. వార్షిక రుణప్రణాళికలో రూ.5,610.28కోట్లు ప్రాధాన్యతా రంగాలకు కేటాయించగా, రూ.802.28కోట్లు ఇతర రంగాలకు కేటాయించామన్నారు. ప్రధానంగా రూ.3,425.85కోట్ల మేర పంట రుణాలు, రూ.732.38కోట్లు టర్మ్ రుణాలు, రూ.537.73కోట్లు వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు వంటి వ్యవసాయ అనుబంధ సాంకేతిక పరికరాల కొనుగోలుకు ఖర్చు చేయనున్నామన్నారు. సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు రూ.700.94కోట్లు, విద్య, గృహనిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక శక్తికి రూ.213.38 కోట్లు ఖర్చు చేయనున్నామని కలెక్టర్ వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

## ఏ ముఖం పెట్టుకొని వస్తున్నావ్

- ఏ హోదాలో సమీక్ష నిర్వహిస్తారు?
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తీరుపై ఎమ్మెల్యే ధన్‌పాల్ ఫైర్
- ఓడిన వ్యక్తికి గులాంగిరి చేయొద్దని అధికారులకు హితవు

వినాయక్‌నగర్, జూన్ 19: ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థి షబ్బీర్ అలీ ఏ హోదాలో కలెక్టర్ క్యాబిన్‌లో కలెక్టర్, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మండిపడ్డారు. బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థివా లేక జిల్లా మంత్రిని అనుకుంటున్నావా? అధికారం ఉందనే అహంకారమా అని ప్రశ్నించారు. సొంత జిల్లా కామారెడ్డిలో చెల్లని రూపాయి ఇక్కడ చెల్లుతుందని టికెట్ ఇస్తే ఇందూరు ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని అన్నారు. ఇంత జరిగినా మళ్లీ ఏ ముఖం పెట్టుకొని వస్తున్నావని షబ్బీర్ అలీపై ఆగ్రహం వ్యక్తంచేశారు. షబ్బీర్ అలీకి ఇందూరు ప్రజలపై ప్రేమ ఉంటే డబుల్ బెడ్రూం ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు ఇప్పించాలని, వంద రోజుల్లో అమలుచేస్తామన్న ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని హితవుపలికారు. భూకబ్జాలు, కమీషన్లు వసూలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పనిచేస్తున్నారని విమర్శించారు. ఇక్కడ తాను ఎమ్మెల్యేనని, ఓడిపోయిన వ్యక్తికి గులాం చేస్తానంటే ఊరుకోనని జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగాన్ని హెచ్చరించారు. ప్రశాంతంగా ఉన్న ఇందూరును ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. షబ్బీర్ అలీ బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాల తరపు ప్రభుత్వ సలహాదారుడని ఇక్కడ శాసన, పరిపాలన విషయాల్లో జోక్యం చేసుకుంటే ఊరుకోబోమని, ప్రొటోకాల్ పాటించాలని సూచించారు.

## బహిరంగంగానే.. కబ్జా



**సిరికొండ** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంపై కన్నేశాడో వ్యక్తి. ప్రభుత్వ విశ్రాంత భవనం నిర్మించేందుకు చేసిన శంకుస్థాపన శిలాఫలకం ఉన్నా.. దానిని కనుమరుగు చేసేందుకు బుధవారం ఆస్థలంలో మొరం పోశాడు. అధికార పార్టీ నాయకుల పేర్లు చెప్పుకొని కబ్జాకు ప్రయత్నించాడు. ఇదంతా గమనించిన స్థానికులు, వీడీసీ సభ్యులు అడ్డుకున్నారు. గతేడాది ఇదే స్థలంలో ఆర్టీసీ మాజీ చైర్మన్, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఎస్డీఎఫ్ నిధులు రూ.40లక్షలతో విశ్రాంత భవనం నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. పదేండ్ల నుంచి ఈ స్థలం వైపు చూడని ఆ వ్యక్తి అధికార పార్టీ నేతల అండదండలతోనే కబ్జాకు యత్నించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. కలెక్టర్ స్పందించి కబ్జా చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– సిరికొండ, జూన్ 19

## పట్టపగలే దర్జాగా..



**అక్రమంగా ఇసుక** తరలిస్తుండగా రోడ్డు కిందకు వెళ్లిన లారీ దిగబడిపోయింది. ఎంతకీ బయటికి రాకపోవడంతో అక్రమార్కుల గుండెల్లో దడ మొదలైంది. ఆలస్యం చేస్తే తమ దొంగతనం బయట పడుతుందనే భయంతో హుటాహుటిన మినీ జేసీబీని పిలిపించారు. రోడ్డుపైనే ఇసుకను పారబోయించి లారీని అక్కడి నుంచి తరలించారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం బెజ్జోరా గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకున్నది. స్థానికంగా ఉన్న కప్పలవాగు నుంచి కొంత కాలంగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ తతంగం నడుస్తున్నదని ఇప్పటికే అధికారులకు అనేక ఫిర్యాదులు అందాయి. అయినా అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, లారీ దిగబడిపోయిన చోట రోడ్డుపైనే ఇసుకను పారిబోసి పారిపోయిన వైనంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత బహిరంగంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై మండిపడ్డారు. **– భీమ్‌గల్, జూన్ 19**